## పేలుళ్ల కేసులో 11 మంది నిందితులకు పదేళ్ల జైలు..

- ఢిల్లీ ఎన్ఐఏ స్పెషల్ కోర్టు తీర్పు

హైదరాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో

జాతీయ స్థాయిలో పెను సంచలనం సృష్టించిన హైదరాబాద్ పేలుళ్ల కుట్ర కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టు నిందితులకు శిక్షలు ఖరారు చేసింది. మొత్తం 11 మంది నిందితులకు పదేళ్ల చొప్పున శిక్ష విధిస్తూ ఢిల్లీలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్ట్ తుది తీర్పును ఇచ్చింది. ఈ కుట్ర వెనుక కీలక సూత్రధారి ఉబెర్ ఉర్ రెహమాన్‌తో పాటు మరో 10 మందికి న్యాయస్థానం శిక్ష వేసింది. హైదరాబాద్‌లో పేలుళ్లు జరిపి విధ్వంసం సృష్టించాలని ప్రయత్నించిన ఈ గ్యాంగ్.. పాకిస్తాన్ నుంచి పేలుడు పదార్థాలు తీసు కొచ్చింది. అయితే దీనిని ముందే పసిగట్టిన తెలంగాణ పోలీసులు వీరి కుట్రను భగ్నం చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నిందితులందరు ప్రస్తుతం రిమాండ్ ఖైదీలుగా జైలులో ఉన్నారు.అయితే, ముజాహిద్దీన్ కుట్రగా ఈ కేసు ప్రాచుర్యం పొందింది. ఇప్పటికే ఈ కేసులో సయ్యద్ ముక్బుల్‌ను సెప్టెంబర్ 22వ తేదీన ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు దోషిగా ప్రక టించిం ది. ఇక, ఈ కేసులో ఐదవ నిందితుడిగా ముక్బుల్ ఉన్నాడు. నాందేడ్‌కు చెందిన ముక్బుల్‌ను ఉగ్ర కదలికల నేపథ్యంలో ఫిబ్రవరి 28 న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాకిస్థాన్ ఉగ్ర సంస్థ ముజాహిద్దీన్‌లోని కీలక సభ్యులతో ముక్బుల్ దగ్గరి సంబంధాలున్నట్లు ఎన్ఐఏ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది.

## కన్నకొడుకుని కిరాతకంగా హత్య చేసిన తండ్రి..

వెన్నులో వణుకు పుట్టించే సంఘటన

కర్నూల్, ప్రభ న్యూస్

ఈ మధ్య కాలంలో నేరాలు మరీ మితిమీరుతున్నాయి. చిన్న చిన్న విషయాలకు కూడా కొందరు హత్యలు చేస్తున్నారు. మరికొందరు రక్త సంబంధం అని కూడా మరిచి కౄరంగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి ఘటన ఒకటీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఏపీలోని నంద్యాల జిల్లా వెలుగోడు పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. వెలుగోడు పట్టణం సిపి నగర్ లో నివాసముంటున్న సిరివేరు రామకృష్ణ తనయుడు సిరివేరు శ్రీనివాసులు చెడు వ్యసనాలకు, చెడు తిరుగుళ్లకు అలవాటు పడి నిత్యం మద్యం సేవించి వచ్చి తన తండ్రితో గొడవపడేవాడు. కొడుకుకు ఎన్నిసార్లు నచ్చచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ.. తనలో మార్పు రాకపోవడంతో విసిగిపోయిన తండ్రి.. నిన్న రాత్రి మద్యం సేవించి గొడవకు దిగిన కొడుకు శ్రీనివాసు పై కన్న మమకారాన్ని చంపుకొని కండువాతో గొంతు నిమిలి హత మార్చాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ముదిరాజుల కోసం..

# భారాస రారాజు పక్కా ప్లాన్



- ఓటుబ్యాంకు సొంతమయ్యేలా భారీ స్కెచ్
- త్వరలోనే అధికార పార్టీలోకి ఆ సామాజికవర్గం కీలక నేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో :

రాష్ట్రంలోని బలమైన సామాజికవర్గాల్లో ఒకటైన ముదిరాజుల కోసం.. భారాస అధినేత, సీఎం కేసీఆర్ ప్రత్యక వ్యూహాన్ని అమ చేయబోతున్నారు. అధిక సంఖ్యలో ఉన్న ఓటు బ్యాంకు సొంతం చేసుకునేందుకు కొత్త స్కెచ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఇందుకు సంబంధించి తన ట్రబుల్ షూటర్ల ద్వారా ఇప్పటికే సంప్రదింపులు, సమాలోచనలు పూర్తి చేసిన కేసీఆర్ ఆ సామాజికవర్గం కీలక నేతను త్వరలోనే అధికార పార్టీలోకి చేర్చుకోబోతున్నారు. ఎన్నికల వేళ నేతల జంపింగ్‌లు ఊపందుకున్న తరుణంలో ప్రతి రోజూ ఎవరో ఒకరు.. ఏదో ఒక పార్టీలో చేరుతున్నారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి.. కాంగ్రెస్ నుంచి బీఆ ర్ఎస్‌లోకి.. బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి.. ఇలా తెలంగాణ రాజకీయం మూడు ముక్కలాటగా రసవత్తరంగా మారింది. ఈ క్రమంలో భారాస బలోపేతానికి ఆ పార్టీ అధినేత కూడా తానుసైతం అంటూ కీలక నేతలను పార్టీలోకి లాగే ప్రయత్నం మొదలుపెట్టారు. తాజా పరిణామాల నేపథ్యంలో తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కూడా పార్టీ మారుతున్నట్లు తెలుస్తోంది. ఆయన తెలుగు దేశం పార్టీకి షాకిచ్చి.. బీఆర్ఎస్‌లో చేరేం దుకు రంగం సిద్ధం చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఒకటి రెండు రోజుల్లో ఆయన సీఎం కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకుంటున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాసాని జ్ఞానేశ్వర్ ప్రస్తుతం తెలుగు దేశం పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా ఉన్నారు. ఐతే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చంద్రబాబు నాయుడు విముఖత వ్యక్తం చేయడంతో ఆయన తీవ్ర అసంతృప్తికి గురైనట్లు తెలుస్తోంది. తెలంగాణలో అన్ని చోట్లా పోటీ చేస్తామని గతంలో కాసాని జ్ఞానేశ్వర్ చెప్పారు. కానీ తెలంగాణలో టీడీపీ పోటీ చేయటం లేదని నారా లోకేష్ పేరిట లేఖ విడుదలవడంతో.. కాసాని నొచ్చుకున్నారట. తెలంగాణలో పోటీ దూరంగా ఉండి.. పరోక్షంగా కాంగ్రెస్‌కు టీడీపీ సహకరిస్తోందని ఆయన కొంతమంది ముఖ్య నేతల ముందు వాపోయారు.ఇది కరెక్ట్ కాదని.. అందువల్లే పార్టీ నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నారని స్పష్టమైన సమాచారం అందింది. కాగా, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నేత. గతంలో ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడిగానూ పనిచేశారు. ఇక ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే టికెట్‌ను కూడా ముదిరాజులకు కేటాయించలేదు. తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న కులాల్లో ముదిరాజ్ ఒకటి. అలాంటి సామాజిక వర్గానికి ఒక్క టికెట్ కూడా ఇవ్వకపోవడాన్ని ముదిరాజులు తప్పుబట్టుతున్నారు. ముదిరాజ్‌లకు టికెట్లు ఇచ్చే పార్టీలకే తమ ఓట్లు వేస్తామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజులు ఆత్మగౌరవ సభలను పెట్టారు. అంతేకాదు పటాన్ చెరు టికెట్ ఆశించి భంగపడ్డ నీలం మధు లాంటి ముదిరాజ్ నాయకులు.. బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఈ నష్టాన్ని పూడ్చుకునేందుకు ఇటీవల కొందరు ముదిరాజ్ నేతలను బీఆర్ఎస్ చేర్చుకున్నారు. ఇప్పుడు కాసాని జ్ఞానేశ్వర్ వైపు చూస్తున్నారు. ముదిరాజ్‌లకు గతంలో పెద్ద దిక్కుగా ఉన్న కాసానిని పార్టీలో చేర్చుకుంటే.. ముదిరాజ్ ఓట్లను తమ వైపునకు తిప్పుకోవచ్చని సీఎం కేసీఆర్ యోచిస్తున్నారట. ఈ క్రమంలోనే కాసానిని పార్టీలో చేర్చుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందింది.

## ఈ నెలాఖరు నుంచి పత్తి కొనుగోళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ :



రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా పత్తి ఏరివేత పనులు సాగుతుండడంతో ఈ నెలాఖరు నుంచి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 350 కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా పత్తికి మద్దతు ధర రూ.7,020గా ఉంది. ఈ ధర దక్కాలంటే పత్తిలో తేమ 8శాతం మాత్రమే ఉండాలని, అయితే 1617శాతం తేమ ఉన్నప్పటికీ ప్రైవేట్ వ్యాపారులు రూ.6,800 నుంచి రూ.7 వేలకు క్వింటా పత్తిని కొనుగోలు చేస్తున్నారని అధికారులు తెలిపారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాలోనివ్యవసాయ మార్కెట్లకు పత్తి రాక మొదలైంది. మరో 1015 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పత్తి కోతకు రానుంది. ఆ సమయంలో ధరలు పడిపోయి రైతులకు నష్టం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందుగానే కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్టు మార్కెటింగ్ శాఖ చెబుతోంది. బహిరంగ మార్కెట్‌లో పత్తి ధరలు పడిపోతే కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 44.77 లక్షల ఎకరాల్లో పత్తి సాగైందని, దాదాపు 40 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు.

## ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలు రిలీజ్

- 2 వేల ఆలస్య రుసుముతో.. డిసెంబర్ 20 వరకు గడువు


**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ:** ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం కోర్సులకు సంబంధించి వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను ఇంటర్మీడియట్ బోర్డు గురువారం విడుదల చేసింది. వార్షిక పరీక్షలు వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థుల నుంచి ఫీజు స్వీకరించాలని ఆయా జూనియర్ కళాశాలలకు బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ఆలస్య రుసుంతో డిసెంబర్ 20 వరకు అవకాశం కల్పించింది. ఈ నెల 26వ తేదీ నుంచి నవంబర్ 14వ తేదీ వరకు విద్యార్థులు ఫీజు చెల్లించాలని సూచించింది. రూ.100 ఆలస్య రుసుంతో నవంబర్ 16 నుంచి 23వ తేదీ వరకు, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు రూ. 500 ఆలస్య రుసుంతో, డిసెంబర్ 6 నుంచి 13 వరకు రూ. 1000 ఆలస్య రుసుంతో, డిసెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు రూ. 2 వేల ఆలస్య రుసుంతో ఫీజు చెల్లించేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఫస్టియర్ రెగ్యులర్ విద్యార్థులు రూ.510, ఒకేషనల్ రెగ్యులర్ విద్యార్థులు రూ.730, సెకండియర్ ఆర్ట్స్ విద్యార్థులు రూ. 510, సైన్స్, ఒకేషనల్ విద్యార్థులు రూ. 730 చొప్పున ఫీజు చెల్లించాలని అధికారులు పేర్కొన్నారు.



## నన్ను చంపేస్తారేమో?

## కుట్ర జరుగుతోంది

- ఏసీబీ కోర్టుకు చంద్రబాబు లేఖ
- పోలీసులకు తెలిపినా పట్టించుకోలేదు



**రేణిగుంట (ప్రభ న్యూస్) :** తనను అంతమొందించేందుకు వామపక్ష తీవ్రవాదులు కుట్ర పన్నుతున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోపించారు.. ఈ మేరకు ఏసీబీ కోర్టు జడ్జికి లేఖ పంపారు. తన భద్రత, ఆరోగ్యంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆయన 3 పేజీల లేఖ రాశారు. ఈ నెల 25న రాసిన లేఖను జైలు అధికారుల ద్వారా జడ్జికి పంపారు. ''నేను జైలుకు వచ్చినప్పుడు అనధికారికంగా వీడియోలు, ఫొటోలు తీశారు. నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ తరహా వీడియో ఫుటేజ్ రిలీజ్ చేశారు. నన్ను అంతమొందించేందుకు వామపక్ష తీవ్రవాదులు కుట్ర పన్నుతున్నారు. కుట్రపై తూర్పుగోదావరి జిల్లా ఎస్పీకి లేఖ కూడా వచ్చింది. ఆ లేఖపై ఇప్పటి వరకు పోలీసు అధికారులు ఎలాంటి విచారణ చేపట్టలేదు''అని చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు. తన భద్రతపై అనేక అనుమానాలున్నాయని, వాటిని పరిశీలించాలని చంద్రబాబు కోరారు.

## భువనేశ్వరి పరామర్శ.. నేడు ఆఖరు!



**రేణిగుంట (ప్రభ న్యూస్) :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఎర్రమరెడ్డిపాలెంలోని సూరా మునిరత్నమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మూడవరోజు మండలంలోని ఎర్రమరెడ్డి పాలెం గ్రామంలోని సూరా ముని రత్నమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సూరా ముని రత్నమ్మ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ జాతీయ నాయకులు రవి, శ్రీధర్ వర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ప్రముఖ న్యాయవాది ఉదయ్ కుమార్ రెడ్డి, వెంకటాపురం మాజీ ఎంపీటీసీ గజేంద్ర రెడ్డి, మండల ఎస్సీ ఎస్టీ సెల్ నాయకులు నెల్లూరు సుబ్రమణ్యం, కొరియర్ రవి, మాజీ ఎంపీటీసీ బుజ్జి నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

